క్లుప్తంగా

జెడ్పీహెచ్ఎస్ కేంద్రం తనిఖీ

● కలెక్టర్ రాజర్షిషా

మనోహరాబాద్(తూప్రాన్): పదో తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం మనోహరాబాద్ మండల కేంద్రంలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగవ రోజు గణితం పరీక్ష జరిగిందని, ఇప్పటి వరకు 99.79 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. ఇప్పటి వరకు మాల్ ప్రాక్టీస్, డీబార్ లాంటివి జరగలేదన్నారు. అంతకు ముందు తరగతి గదుల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును గమనించారు.. సీసీ కెమెరా నిఘాలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. వీరి వెంట ఆర్డీఓ శ్యాం ప్రకాష్ ఉన్నారు.

'బీఆర్ఎస్‌కు సర్పంచ్ రాజీనామా'

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కట్టెల వెంకటాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ పెరుమాండ్ల గంగమణితో పాటు ముగ్గురు వార్డు సభ్యులు మొగులయ్య, మల్లేశం, 8వ వార్డు సభ్యులు, నాయకులు పెరుమాండ్ల భాను పార్టీకి, సభ్యత్వానికి శనివారం రాజీనామా చేసి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడికి, ఎమ్మెల్యేకు తన రాజీనామా పత్రాన్ని పంపించారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి పార్టీ ఆరంభం నుంచి అండగా ఉన్నా.. తనకు పార్టీలో గుర్తింపు సరిగ్గా లేకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు సర్పంచ్, వార్డు సభ్యులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): టీబీ వ్యాధిగ్రస్తులు ఎప్పటికప్పుడు వైద్యుల సూచనల మేరకు అప్రమత్తంగా ఉండాలని మండల ఎంఎల్‌హెచ్‌పీ శిరీష అన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండలంలోని సంగాయిపల్లి గ్రామంలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రియంక, సర్పంచ్ సత్తమ్మ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



అంగన్‌వాడీ టీచర్‌తో మహిళలు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని ఎంకెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన కూడా చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం, టీచర్ వీర్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు సుమలత, ఆశవర్కర్ వినోద, సహాయకురాలు ప్రమీల, ఏఎన్ఎం స్వప్న, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.


స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



సోలార్ లైట్లు, డబ్బాలు అందిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాభివృద్ధి కోసం తోర్పాటు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని సర్పంచ్ బాలమణి అన్నారు. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల పంచాయతీకి సెగల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ శనివారం 51 సోలార్ చార్జింగ్ లైట్లతో పాటు పలువురు రైతులకు సోలార్ మందు పిచికారీ డబ్బాలు అందజేశారు. సోలార్ లైట్ల ద్వారా విద్యుత్ లేకున్న వీధిలైట్లు వెలగనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిధులతో పాటు, స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భిక్షపతిరావు, వార్డు సభ్యులు, సెగల్ ఫౌండేషన్ సిబ్బంది వేమనారాయణ, పవన్, వెంకట్, లావణ్య తదితరులు ఉన్నారు.

కంటివెలుగు కరపత్రం అందజేత



కరపత్రాలు అందిస్తున్న ఏఎన్ఎం

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట గ్రామంలో సోమవారం నుంచి నిర్వహించే కంటివెలుగు కార్యక్రమం విజయవంతం చేయాలని స్థానిక ఏఎన్ఎం అనురాధ శనివారం పాలక వర్గానికి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణలత, ఉపసర్పంచ్ సంతోష్, వార్డు మెంబర్లు, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

రోడ్డును బాగు చేయరూ..

● అవస్థలు పడుతున్న ప్రజలు
● పట్టించుకోని అధికారులు



కాట్రియాల శివారులో దెబ్బతిన్న రోడ్డు

రామాయంపేట(మెదక్): మెదక్, కామారెడ్డి జిల్లాల సరిహద్దు గ్రామాలను కలిపే రోడ్డు పూర్తిగా అధ్వానంగా ఉంది. దీంతో రెండు జిల్లాల శివారు గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని కాట్రియాల నుంచి కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలంలోని రామేశన్‌పల్లి గ్రామాల మధ్య ఏడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. కాగా ఈ దారిలో కాట్రియాల పరిధిలో పెద్ద చెరువు అలుగుతో పాటు ఎర్ర కుంట కాలువ ఉంది. కొద్దిపాటి వర్షం కురిసినా కాల్వ పొంగి పొర్లుతోంది. దీనితో ప్రతీ ఏటా ఈదారిలో ప్రయాణాలు ఆగిపోతాయి. మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలతో వారం రోజుల పాటు ఈదారిలో రాకపోకలు స్తంభించాయి. కాగా చిన్నపాటి చినుకులు కురిసినా రహదారి మొత్తం బురదమయంగా మారుతోంది. గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ భుములు ఈదారిలోనే ఉండగా, వారు పంట చేలకు రావడానికి, తమ పంటలను ఉత్పత్తులను తరలించుకోవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డును పూర్తిస్థాయిలో తారు రోడ్డుగా మారిస్తే రెండు జిల్లాల శివారు గ్రామాల ప్రజల ఇబ్బందులు తీరుతాయని గ్రామస్తులు అంటున్నారు. ముఖ్యంగా చెరువు, కుంట వద్ద రోడ్డుపై కల్వర్టుల నిర్మాణం అత్యవసరం కాగా ఈ విషయమై ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎంత మాత్రం పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని ఈ రహదారిని తారురోడ్డుగా మార్చడంతో పాటు అవసరమైన చోట బ్రిడ్జిలు నిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టులకు అండగా ఉంటా



హెల్త్‌కార్డులు అందిస్తున్న సునీతారెడ్డి

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతారెడ్డి

నర్సాపూర్: జర్నలిస్టులకు అండగా ఉంటానని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. సూరారంలోని నారాయణ హృదయాలయ ఆస్పత్రి అందజేసిన హెల్త్ కార్డులను ఆమె శనివారం జర్నలిస్టులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలువురు జర్నలిస్టులు తమకు హెల్త్‌కార్డులు ఇప్పించాలని తనను కోరగా, తాను నారాయణ ఆస్పత్రి యాజమాన్యంతో చర్చించి, నియోజకవర్గంలోని జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు ఇచ్చేలా యాజమాన్యాన్ని ఒప్పించానని చెప్పారు. నారాయణ ఆస్పత్రి అందజేస్తున్న హెల్త్‌కార్డు ద్వారా వైద్యం ఖర్చులో కొంత రాయితీ లభిస్తుందన్నారు. కాగా జర్నలిస్టులకు మున్ముందు తన వంతు సహకారం అందిస్తానని వివరించారు. కాగా తమకు హెల్త్‌కార్డులు ఇప్పించినందుకు జర్నలిస్టులు సునీతారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సత్యంగౌడ్, జ్ఞానేశ్వర్, సుదాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు



మట్టి తవ్వకాలు చేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా అసైండ్ భూముల్లో నుంచి మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. మండల పరిధిలోని నవాబుపేట గ్రామ పరిధిలోని అసైండ్ భూమి సర్వే 309లో నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రెండు రోజుల నుంచి జేసీబీతో తవ్వకాలు చేస్తు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. మండల సరిహద్దు కావడంతో ఇక్కడ నిత్యం మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నా.. సంబంధిత అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపించారు. వాల్టా చట్టానికి విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేస్తున్న వారిపై సంబంధిత ఉన్నతధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయం గురించి తహసీల్దార్ శ్రీనివాస్‌చారి వివరణ కోరగా, మట్టి తవ్వకాల విషయం మా దృష్టికి రాగా మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోని తవ్వకాలు చేయాలని సూచించామని వివరించారు.

ఈస్టర్ గిఫ్ట్‌ల పంపిణీ



గిఫ్ట్ ప్యాకెట్లు అందిస్తున్న దృశ్యం

మెదక్‌జోన్: పట్టణంలోని గ్రోస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెదక్ నియోజకవర్గంలో 150 ప్రైవేట్ పాస్టర్లకు ఈస్టర్ గిఫ్ట్ ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు జాయ్‌ముద్రె మాట్లాడుతూ.. సుమారు రూ. 80 వేల ఖర్చుతో ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సామ్‌సన్, సందీప్, జోల్‌శ్యామ్, ఆనందసింగ్, చెర్రీ, మధు, సంగయ్య తదితరులు ఉన్నారు.

రన్‌ఫర్ జీసస్



మాట్లాడుతున్న పాస్టర్ దేవవరం

పెద్దశంకరంపేట(మెదక్): పేటలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి పాస్టర్ దేవవరం, మహిళలు, యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కారు బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

కౌడిపల్లి(నర్సాపూర్): కారు బైక్ ఢీ కొనడంతో ఒకరికి గాయాలైన సంఘటన 765డీ జాతీయ రహదారిపై మండల కేంద్రం కౌడిపల్లి ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్ వద్ద శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాయిలాపూర్ తండాకు చెందిన ప్రసాద్ కౌడిపల్లి వైపు నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. మెదక్ మక్తభూపత్‌పూర్‌కు చెందిన వ్యక్తి కారులో నర్సాపూర్ వైపు నుంచి మెదక్ వస్తున్నాడు. పెట్రోల్ బంక్ సమీపంలో బైక్, కారు ఢీ కొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న ప్రసాద్‌కు గాయాలయ్యాయి. బాధితున్ని చికిత్స కోసం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు



సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో కాంగ్రెస్ బలోపేతం చేయడానికి శనివారం యువజన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఇప్పటి నుంచే పార్టీ కార్యకర్తలను సమయాత్తపర్చడానికే ఈ సమావేశం నిర్వహించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ మేరకు గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి గాను యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ యూత్ విభాగం అధ్యక్షుడు రమావత్ వినోద్, నాయకులు సులేమాన్, కరుణాకర్‌రెడ్డి, రాజాగౌడ్, అభిలాశ్, తిరుమల్, కరుణాకర్, కాకి రాజయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గొల్లెగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం టీబీ ఏసీఎఫ్ క్యాంప్, ఎన్సీడీ క్యాంప్ నిర్వహించారు. క్యాంపులో భాగంగా అనుమానిత టీబీ, షుగర్, బీపీ వ్యాధులకు చికిత్స నిర్వహించారు. రోగులకు, వైద్యపరీక్షలు నిర్వహించుకున్న వారికి ఆరోగ్యంపై పలు జాగ్రత్తలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఇందులో డాక్టర్ అనిత, టీబీ మోడల్ ఆఫీసర్ సుగుణాకర్, ఎన్సీడీ స్టాఫ్ నర్స్ దుర్గాదేవి, ఏఎన్ఎం భూదేవి, ఆశవర్కర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చాకరిమెట్లలో భక్తజన సందడి



పూజలు చేస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మకు బోనాలు



బోనాలతో భక్తులు

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రం అల్లాదుర్గంలో బేతాళస్వామి జాతరలో భాగంగా శనివారం భక్తులు బోనాలు ఊరేగించి పోచమ్మకు సమర్పించారు. బోనాల ఎదుట శివసత్తులు నృత్యాలు చేశారు. రెండు రోజులుగా స్వామివారికి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుతున్నారు. వందలాది మంది మహిళలు, చిన్నారులు ఉత్సవాలను తిలకించేందుకు వచ్చారు. ఆదివారం దుర్గమ్మకు బోనాలు తీయనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

హోమియోపతి వైద్య శిబిరం



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రమేశ్, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి

గజ్వేల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధి నాలుగో వార్డులో ములుగు మండలం క్షీరసాగర్‌కు చెందిన హంస హోమియోపతి మెడికల్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరాన్ని గజ్వేల్ ఏసీపీ రమేశ్, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి సందర్శించి వైద్య సేవల తీరును కొనియాడారు. శిబిరం నిర్వహణకు కృషి చేసిన వార్డు కౌన్సిలర్ పంబాల అర్చన శివకుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లుచందు, వరలక్ష్మీ పాల్గొన్నారు.

సంతలో కూరగాయల నారు



కూరగాయల నారును విక్రయిస్తున్న దృశ్యం

తూప్రాన్: వారంతపు కూరగాయల అంగళ్లలో వివిధ కూరగాయల నారులను కొంత మంది కూరగాయల మాదిరిగా విక్రయిస్తున్నారు. రైతులు సైతం అంగళ్లలో ఎగబడి కొనుగోలు చేసుకుంటున్నారు. వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తూప్రాన్‌లోని సంత ఇందుకు నిదర్శంగా నిలుస్తుంది.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కొత్తగా వేసిన సీసీ రోడ్డు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామానికి రూ. 25లక్షల ఉపాధిహామీ నిధులు మంజూరయ్యాయి. దీంతో సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి పనులు ప్రారంభించగా, నర్సాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాజుయాదవ్ కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాడు. కౌడిపల్లిలోని పల్లెగడ్డ, కొత్త కాలనీలోని పలు వార్డుల్లో సీసీ రోడ్డు వేస్తున్నారు.

హైదరాబాద్‌కు తరలిన బీజేపీ నాయకులు



నర్సాపూర్: సభకు తరలుతున్న సింగాయపల్లి గోపి, నాయకులు



చేగుంట(తూప్రాన్): చేగుంట నుంచి తరలిన బీజేపీ నాయకులు



పెద్ద శంకరంపేట(మెదక్): సభకు తరలుతున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: హైదరాబాద్‌లో శనివారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభకు నర్సాపూర్ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయపల్లి గోపి ఆధ్వర్యంలో నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్ పార్టీ నాయకులు రఘువీరారెడ్డి, బాల్‌రెడ్డి, నాగరాజు, ఆయా మండల శాఖల అధ్యక్షులు దశరథ్, నర్సింలు, నగేష్‌గౌడ్ తదితరులు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి అక్కడికి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కాగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, ఇతర నాయకులు రాజేందర్, తదితరులు ఆర్టీసీ పెట్రోల్ బంకు నుంచి బయలు దేరి వెళ్లారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రం పెద్దశంకరంపేట నుంచి మోదీ సభకు తరలిన వారిలో మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్, మాజీ సర్పంచ్ కాశీరాం, కృష్ణ, శ్రావణ్, సాయిలు, కృష్ణ, విశ్వనాథం తదితరులున్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట నుంచి మోదీ సభకు తరలిన వారిలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేశ్‌రవికుమార్, మండల అధ్యక్షుడు భూపాల్, యాదగిరి, సాయిప్రసాద్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం చిన్నశంకరంపేట నుంచి మోదీ సభకు తరలిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు పట్లోరి పోగులరాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జనగామ మాల్లారెడ్డి, జిల్లా నాయకులు సరేష్‌గౌడ్, బీజేపీ మండల నాయకులు నరేందర్‌రెడ్డి, గణేశ్, శ్రీనివాస్, పరశురామ్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్

గజ్వేల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయ కమిటీకి శనివారం పోటాపోటీగా జరిగిన ఎన్నికల్లో ఎర్రం శ్రీనివాస్ గెలుపొందారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా బచ్చు రవి, కోశాధికారిగా నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా దుర్గం స్వామి, సంయుక్త కార్యదర్శిగా కొడిశెట్టి శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళితో పాటు పట్టణ ప్రముఖులు అభినందించారు.

పాడుబడిన బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని వడియారం చర్చి సమీపంలోని పాడుబడిన బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. శనివారం రాత్రి అటుగా వెళ్లిన స్థానికులు చర్చి సమీపంలోని పాడుబడిన బావిలో మృతదేహం ఉన్నట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం ఉన్నట్లు తేలింది. రాత్రి సమయంలో మృతదేహం బయటకు తీసేందుకు ఇబ్బంది కలిగే అవకాశం ఉండటంతో ఆదివారం ఉదయాన్నే శవాన్ని బయటకు తీసేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.